# హిడింబ

లాక్షా గృహ ప్రమాదం నుంచి తప్పించుకుని బయటపడ్డారు పాండవులు.

ఈ నిర్జనారణ్యంలో విశ్రమించే స్థలం కోసం, తాగే నీటి కోసం వెతుక్కుంటూ ఒక పెద్ద మర్రిచెట్టు నీడకు చేరారంతా. ఆకలిదప్పులు బాధిస్తుంటే, ఇక ముందడుగు వేయలేక ఆ చెట్టు నీడను ఆశ్రయించారు, ఒక్క భీమసేనుడు తప్ప.

ఘోరారణ్యంలో అందరిని ఆదుకోదగిన మహావీరుడు భీమసేనుడు. అక్కడి పరిస్థితిని పర్యాలోకిస్తున్నాడు. తల్లిని, సోదరుల్ని విశ్రమింపమని చెప్పి, వారి దప్పిక తీర్చటానికి నీళ్ళ కోసం బయలుదేరాడు.

అలా వెళ్ళగా వెళ్ళగా, తామర పుష్పాలతో కలకలలాడుతూ, సుగంధాలు వ్యాపింపజేస్తూ, శీతల వారిపూరమైన సరోవరం కనిపించింది భీమసేనునికి. తాను తృప్తిగా నీరు తాగి సేదతీర్చుకుని, తన వారికని పత్రపుటాల్లో నీరు నింపి తెచ్చాడు.

అప్పటికే చీకటి పడుతోంది. తల్లి, సోదరులు అలసి సొమ్మసిల్లి నిద్రిస్తున్నారు. వారికి నిద్రాభంగం కలిగించటం ఇష్టం లేక, వారి రక్షణ నిమిత్తమై అక్కడే నిలిచాడు. రాజప్రసాదాల్లో హంసతూలికా తల్పాలపైన నిద్రించవలసిన వీరంతా ఈ కటిక నేలపై, అరణ్య మధ్యంలో తమను తాము మరిచి నిద్రించటం భీమసేనునికి ఎంతో బాధనీ, ఆశ్చర్యాన్నీ కలిగించింది.

ప్రకృతి సౌందర్యాన్ని వీక్షిస్తూ, భవిష్యత్తు గురించి ఆలోచనలు చేస్తున్న భీమసేను దృష్టి తననే తదేకంగా చూస్తూ చెట్టు చాటున దాగివున్న స్త్రీమూర్తి పైన నిలిచింది.

అది భ్రమా, నిజమా-వృక్షం వెనక దాగి ఉండబట్టి ఆమె శరీరం పూర్తిగా కనబడటం లేదు. ఆమె ముఖం ముందుకు పెట్టి నిలకడగా చూస్తోంది. విశాలమైన నేత్రాలు, నల్లని పొడవైన కేశపాశం, ఆమె ధరించిన మణిమయ

హారాలు, ఆమె ముంజేతి రత్నకంకణాలు, ఆమె దేహం నుంచి వెలువడుతున్న వింతకాంతి–భీమసేనునికి ఆశ్చర్యం కలిగిస్తున్నాయి.

తన వారిని రక్షించాలని మెలకువగా ఉన్న తను స్వప్నం కంటున్నాడా అనే అనుమానం వచ్చింది వాయునందనునికి. ఆ సౌందర్యరాశి నెమ్మదిగా కదులుతూన్నట్టనిపించింది.

చెట్టు చాటు నుంచి కదిలి మందగమనంతో తనని సమీపిస్తుండే భీమసేనునికి ఏమీ అర్థం కావటం లేదు.

సామాన్య స్త్రీల కంటే భిన్నంగా, విలక్షణంగా ఆ అవయవాల సొంపు, ఆ నడకలో వయ్యారం, భీమసేనుని వైపు ఆమె ప్రసరించే చూపులు అతనికి విచిత్రంగానే కనిపిస్తున్నాయి.

భీమసేనుని విశాల వక్షస్థలం పైన, అతని దీర్ఘబాహువులపైన, అతని బిగువైన కంఠం పైన, విశాలమైన ఫాలభాగం పైన ఆమె దృష్టి సారించి, విలాసంగా అతని పక్కన నిలవగానే అతనికి చిరాకు కలిగింది.

కార్యదీక్షతో కీకారణ్య మధ్యంలో ఉన్న భీమసేనుణ్ణి ఆ సౌందర్యరాశి ఏ విధంగానూ చలింపచేయలేకపోయింది.

"ఎవరు నువ్వు? స్త్రీలు ఒంటరిగా తిరిగే సమయమా ఇది? ఈ కీకారణ్యంలో కెందుకొచ్చావ్? త్వరగా కదులు."

భీమసేనుడు ఆమెను కసురుతుంటే, ఆమె ఏ పాటి నిరుత్సాహపడలేదు. అవమానపడలేదు.

భీమసేనుని శరీర సౌందర్యం నేత్రానందం కల్గిస్తోందామెకు. ఆమెలో మదన పరవశత్వం క్షణక్షణం పెరుగుతోంది. అతని విశాల వక్షస్థలం వైపు చూస్తూ "ఈ వనాధిపతి హిడింబాసురుడు నా అన్న. నరమాంస మపేక్షించి మిమ్మల్నందరిని తీసుకురమ్మని నన్ను పంపాడు. కానీ, నిన్ను చూసిన క్షణమే నా మనసు నీతో నిండిపోయింది. నన్ను నీవు చేపడితే, నేను మా అన్న నుండి కాపాడుతా." క్రీగంట చూస్తోంది హిడింబ.

ఆ మాటలకు నిశ్చేష్టుడయ్యాడు భీమసేనుడు. కానీ వెంటనే క్రోధావేశం అతన్ని ఊపేసింది. ఒక స్త్రీ తన అన్నపేరు చెప్పి తనని బెదిరించటమా? తనను కాపాడుతా ననటమా? భీమసేను డది సహించలేకపోయాడు.

"నా అన్నని గెలవ గలిగిన వాడెవడూ లేడు. ఇంద్రాదులైనా నా అన్న పేరు చెప్తే బెదిరిపోవాల్సిందే. నీ మీద ప్రేమ కొద్దీ నా అన్నకి వ్యతిరేకంగా నీకు సహాయం చేస్తానన్నాను. వీరంతా సొంత ఇంట్లో నిద్రించినట్లు నిద్రిస్తున్నారే. మా అన్న తల్చుకుంటే అంతా శాశ్వత నిద్రపోవచ్చు. కానీ నీ మీద ప్రేమతో వారిని నా అన్న కప్పగించి, నిన్ను రక్షించుకుంటా."

హిడింబ మాటలు భీమసేనుని రౌద్రాకారుణ్ణి చేశాయి.

"ఆ నిద్రిస్తున్న వారు నా తల్లీ, సోదరులు."

"అయ్యో, అయితే వారందరినీ ఈ అరణ్యం నుంచి దాటించి రక్షిస్తా." హిడింబి చిరునవ్వు నవ్వింది.

"నా ప్రేమను కాదనకు." బతిమాలుతోంది.

"స్త్రీ వ్యామోహంలో పడి కర్తవ్యాన్ని విస్మరించే మూర్ఖుణ్ణి కాను, నా వారిని నేను రక్షించుకోగలను, తక్షణం ఇక్కడ నుంచి కదులు. నీ అన్న నన్ను ఏమీ చేయలేడు, ఫో!"

భీమసేనుని అరుణారుణ నేత్రాలను చూసి భయపడింది హిడింబ.

తన చెల్లెలు ఇంత ఆలసించటాన్ని సహించలేక సింహగర్జన చేస్తూ నల్లని పెద్ద మేఘంలా ముందుకు తోసుకొచ్చాడు హిడింబుడు.

బహుసుందరమైన స్త్రీ రూపం దాల్చి, ఒక నరునితో ముచ్చటిస్తూ, అతని చెంత నిల్చిన హిడింబను చూడగానే హిడింబుని ఆగ్రహం కట్టలు తెంచుకుంది. తనకు కీడు తలపెట్టిన ఆమెను అంతం చేయాలనే ఆవేశంతో ఆమె పైకి ఉరికాడు. భయంతో గజగజలాడుతూ భీమసేనుని వెనక దాగింది హిడింబ.

తన వారికి నిద్రాభంగ మౌతుందని, హిడింబుని దూరంగా లాక్కుపోయాడు భీమసేనుడు.

యుద్ధం జరుగుతోంది. హిడింబుడు పెట్టిన పెద్ద కేకలకి నిద్ర భంగమై లేచిన కుంతీదేవి, దగ్గరున్న విలాసవతిని చూసింది భయంతో, ఆశ్చర్యంతో.

"ఎవరు నువ్వు," అంది అనుమానంగా ఆమెను చూస్తూ.

"ఆ మహావీరునితో మల్లయుద్ధం చేస్తున్న హిడింబాసురుని చెల్లెల్ని" అంటూ సవినయంగా విషయమంతా చెప్పి, "ఆ మహావీరుని సౌందర్యానికి,

పరాక్రమానికి నా మనసు పరవశిస్తోంది. అతన్ని చూసిన మరుక్షణమే నా మనసు అతనికి అంకితం చేశాను. ఆ మహావీరుణ్ణి ప్రేమిస్తున్నాను." ఈ మాట అంటూ హిడింబ సిగ్గుతో తలవంచింది.

కుంతీదేవికి ఆమె మాటలు చిత్రంగా వినిపిస్తున్నాయి. తన కుమారుని పరాక్రమానికి మనసిచ్చి వచ్చిన ఆమెను చూస్తుంటే అప్రయత్నంగా కుంతికి ఆనందంకలిగింది. హిడింబ మనసువిప్పి మాట్లాడుతుంటే ఎంతో ముచ్చటేసింది.

"నాకు కామ విద్యలొచ్చు. మీ ఎవరికీ ఏ ఆపదా రాకుండా నేను కాపాడగలను. నన్ను విశ్వసించండి. నీ కుమారుడిపై ప్రేమతో నా అన్న ఆజ్ఞని నెరవేర్చలేకపోయాను. నీ కుమారుడి మీది ప్రేమతో మిమ్మల్నందర్నీ కాపాడుతాను.'

హిడింబ మాటలు కుంతి మనసుని చలింపజేస్తున్నాయి.

"నన్ను భార్యగా స్వీకరించమని నీ కుమారుడికి చెప్పు." కుంతి పాదాలకు మొక్కింది హిడింబ.

యుద్ధం ఘోరంగా సాగుతోంది. రాక్షస మాయలు, యుద్ధ విద్యలు తెలిసిన అర్జునుడు భీమసేనుణ్ణి సమీపించాడు. సంధ్యాసమయంలో రాక్షసుల బలం అనంతంగా విజృంభిస్తుంది. ప్రాతస్సంధ్యాకాంతులు రాక ముందే హిడింబుని హతమార్చమని తొందరచేశాడు భీమసేనుణ్ణి అర్జునుడు.

అర్జునుని మాటలు పాటించి, మహోగ్రరూపంతో వీరావేశంతో హిడింబాసురుణ్ణి సంహరించాడు భీమసేనుడు.

భీమసేనుని విజయాన్ని తల్లి, సోదరులు అభినందిస్తుండే, మందగమనంతో వారిని అనుసరించింది హిడింబ.

ఆమె తనను మనసారా కోరుకుంటున్నదని అర్థమైంది భీమసేనునికి. కానీ, రాక్షసుల పగలు తరతరాలు వెంటాడుతాయి. రాక్షసమాయలు నమ్మరానివి.

వెంటనే హిడింబను తన వారితో రావద్దని వారించాడు. హిడింబ జాలి చూపులతో కుంతివైపు చూసింది.

"నీ కుమారుడు నన్ను స్వీకరించకపోతే, ఇక్కడే ఈ అరణ్యంలో ప్రాణత్యాగం చేస్తాను." నెమ్మదిగా, గాద్గదికంగా అంది హిడింబ కుంతితో.

'నిజంగానే నా కుమారుణ్ణి ప్రేమిస్తోంది. ఆ ప్రేమ సఫలం కాకపోతే ప్రాణత్యాగం చేస్తుంది' అనుకుంటూ కుంతి సాదరంగా ఆమెను చూసింది.

కుంతి మనసు కరిగింది. హిడింబ చేయి పట్టుకుని భీమసేనుడి దగ్గరకొచ్చింది. అప్పటికే ధర్మరాజుకు హిడింబపైన సదభిప్రాయం కలిగింది. అందరికీ ఆమెపైన జాలి కలిగింది. భీమసేనుని కోసం తన సోదరుని పోగొట్టుకుని తమతో వచ్చిన హిడింబకు అన్యాయం జరగరాదని అందరికీ అనిపించింది.

తల్లి, సోదరుల మనోభావం గ్రహించాడు భీముడు. సర్వమూ త్యాగం చేసి తన ప్రేమకని ఎదురొస్తున్న హిడింబపై భీమసేనునికి ఆదరం కలిగింది. ఆ నిర్మలమైన ప్రేమ అతని మనసుని తాకింది. కానీ, రాజకీయ పరిస్థితులు, తన కుటుంబ పరిస్థితులు అతని మనసు నుండి తొలగిపోవటం లేదు దీర్ఘంగా ఆలోచించాడు భీమసేనుడు.

''సంతానం కలిగేవరకే ఈమెతో నా సాంగత్యం'' అంటూ భీమసేనుడు ముందుకు నడిచి, హిడింబను సమీపించి, ఆమె పాణిగ్రహణం చేశాడు.

ఆ కరస్పర్శకి పులకితురాలై, ఆ మహావీరుని వల్ల జన్మించే పుత్రుణ్ణి ఊహించుకుంటూ మురిసిపోయింది హిడింబ.

కుంతీదేవి వారిని చూస్తూ మహదానందం చెందింది. హిడింబ వైపు తిరిగి అనునయంతో, ''మీరు ఈ అరణ్య భూముల్లో, కొండ కోనల్లో, ఇసుక తిన్నెల మీద, సరోవర తీరాల్లో యథేచ్ఛగా విహరించండి పగలంతా - కానీ రాత్రి నువ్వు మాకు రక్షణగా మా దగ్గరే ఉండాలి'' అంది.

కుంతీదేవి మాటలు తనకు అంగీకారమే అన్నట్టుగా తల ఊపి, పాదాభివందనం చేసింది హిడింబ.

*

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం : ఆదిపర్వం : షష్ఠాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక : 27-4-1938)